చావాలని లేదు. నేను మందు తాగబోతూ ఆగి దేవుణ్ణి ఒక్కటే ప్రార్ధించాను. 'నా చేతికి వచ్చిన నంబర్‌ని డయల్ చేసి, తోచిన పేరుని అడుగుతాను. నేను బ్రతకాలని వుంటే ఆ నంబర్‌లో ఆ పేరుగల వాళ్ళతో మాట్లాడించు. నంబర్ కలవక పోయినా లేదా ఆ నంబర్‌లో ఆ పేరు గలవాళ్ళు లేకపోయినా వెంటనే ఈ మందు తాగేస్తాను' అనుకుని డయల్ చేసి పుండరీకరావు కోసం అడిగాను. నిజానికి నేను ఆ పేరు గలవారితో మాట్లాడుతున్నా నాకు నమ్మశక్యంగా లేదు."

"నా పేరు నిజంగా పుండరీకరావే. ఇది మెడికల్ షాపు. మా ఆవిడ తనకి తలనొప్పిగా వుందని, మందు తీసుకురమ్మని అరగంట నించి పోరుతూంటే ఇప్పుడే వచ్చాను. నిజానికి ఈ ఫోన్ నంబరుని మీరు డయల్ చేయడానికి ఆ దేవుడే మీ చేతి వేళ్ళల్లోకి ప్రవేశించి ఈ నంబర్‌ని డయల్ చేసి వుంటాడు. మీరు చావడం దేవుడికి ఇష్టం లేదని గ్రహించండి." చెప్పాడు పుండరీకరావు.

"థాంక్స్ రావు గారు. థాంక్స్ ఏ లాట్." ఆమె మాటల్లో రిలీఫ్ ధ్వనించింది.

వెంటనే లైన్ కట్ అయింది.

"ఏమిటి?" ప్రశ్నార్ధకంగా చూస్తూ అడిగాడు మెడికల్ షాపు యజమాని.

"ఏం లేదు. నేను ఇప్పుడు, ఇక్కడ మీ షాపులో మీ ఫోన్ ముందు వున్నానని దేవుడికి తెలుసు." ఆనందంగా నవ్వుతూ చెప్పాడు పుండరీకరావు.

## 80. సరైన ప్రవర్తన

యూదు రేబ్బి అకివ ఐజెల్ ఓసారి వర్షంలో ఓ గుర్రబ్బండిలో వెళ్తున్నాడు. అకస్మాత్తుగా ఆ బండి చక్రం ఇరుసు కొద్దిగా వదులైంది. బండిని నడిపేవాడు ఆ సంగతి అకివ ఐజెల్‌కి చెప్పి, బండి దిగి దాన్ని బాగు చేసి మళ్ళీ బండి ఎక్కాడు. కురిసిన వర్షం నీళ్ళల్లో అతని పాదాలు తడిసి, చలికి జివ్వుమనసాగాయి.

రేబ్బి బండి లోంచి పొడిగా వున్న నీలం రంగు సాక్స్ జతని బండి వాడికి ఇచ్చి చెప్పాడు.

"వీటిని ధరించు."

బండి నడిపేవాడు వాటిని కృతజ్ఞతగా అందుకుని, పాదాలని పాత బట్టతో తుడుచుకుని వాటిని ధరించాడు. దాంతో పాదాల నించి చలి ఒంట్లోకి పాకడం ఆగింది. బండి గమ్యం చేరాక రేబ్బి బండిలోంచి కిందకి దిగాడు. ఆయన పాదాలకి సాక్స్ లేకపోవడం గమనించిన బండివాడికి అర్థం అయింది ఆయన తనవి విప్పి తనకి వాటిని ఇచ్చాడని. బండివాడు నొచ్చుకుంటూ చెప్పాడు.

"అయ్యో! మీవి తీసి ఇచ్చారని తెలిస్తే తీసుకునేవాడిని కాను."

"నా కాళ్ళు పొడిగానే వున్నాయి. నేను పొడికాళ్ళకి సాక్స్‌ని ధరించి కూర్చుంటే, నువ్వు తడి కాళ్ళతో సాక్స్ లేకుండా బాధపడటం చూసి వాటిని నీకు ఇవ్వక పోతే నాది సరైన ప్రవర్తన అవుతుందా? నువ్వే చెప్పు." రేబ్బి నవ్వుతూ అడిగాడు.

## 81. సన్నిధి

ఓ ఆశ్రమంలో వుండి ఆధ్యాత్మిక విద్యాభ్యాసం చేస్తున్న ఓ శిష్యుడు ఓ రోజు తన గురువు దగ్గరకి వచ్చి చెప్పాడు.

"స్వామి! నేను మన ఆశ్రమం నించి వెళ్ళిపోదామని అనుకుంటున్నాను. ఇంటి దగ్గరే చదువుకుంటాను."

"అలా చేస్తే నువ్వు కష్టాలకి గురవుతావు. తోటి శిష్యుల సన్నిధిలో వుండి నువ్వు చదువుకుంటే బావుంటుంది." చెప్పాడు గురువు.

"కాని..."

"సరే. వివరణ వద్దు. నువ్వు నిశ్చయించుకుంటే వెళ్ళు."

సమీపంలో ఉన్న అరటి గెలలోంచి ఓ పండుని తెంపి ఇచ్చి చెప్పాడు.

"ఇది నీకేమైనా బోధిస్తుందేమో దారిలో చూడు."

శిష్యుడు అందరి దగ్గరా శెలవు తీసుకుని బయలుదేరాడు. ఆ రాత్రి ఓ అడవిలో ఓ కొలను సమీపంలో విశ్రమించాడు. ఆకలి వేయడంతో సంచీలోంచి గురు పత్ని ఇచ్చిన తినుబండారాలు తీసి తిన్నాడు. చివరగా గురువు ఇచ్చిన అరటిపండుని తీసాడు. గురువు దాని గురించి చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి.